

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్

# ఆశలకు ఇచ్చిన హామీ ఏమైంది?

- గతంలో వారికి అండగా నిలిచిన బీఆర్ఎస్ ప్రభుత్వం
- అన్ని వర్గాల సమస్యలపై పోరాటం చేస్తాం
- బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వినయ్‌భాస్కర్

**ఎనిమిది నెలలైనా కనీసం వేతనం పెంచని కాంగ్రెస్ సర్కారు**

హనుమకొండ, జూలై 28: ఎన్నికల మ్యానిఫెస్టోలో ఆశ కార్యకర్తలకు నెలకు రూ. 18000లు ఫిక్స్‌డ్ వేతనం ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎనిమిది నెలలు గడు స్తున్నా పట్టించుకోక మోసం చేసిందని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ ఆరోపించారు. ఆదివారం హనుమకొండ బాలసముద్రం లోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో బీఆర్ టీయూ అనుబంధ తెలంగాణ గ్రామీణ ఆరోగ్య కార్యకర్త ల(ఆశ) సంఘం ఆధ్వర్యంలో జిల్లా కన్వీనర్ నాయిని రవి అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతి థిగా హాజరై మాట్లాడారు. ఆశ వర్కర్లను గత సీఎం కేసీ ఆర్ గుర్తించి రూ. 2 వేలున్న పారితోషికాన్ని రూ. 9 వేలకు పెంచి గౌరవించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు గడుస్తున్నా కనీసం వేతనం అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే ప్రమాద బీమా పాలసీ లేదని, ఎన్‌సీ టార్గెట్స్ పెట్ట డంతో వారు అనేక ఇబ్బం దులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టిన ఏ ఒక్క హామీ నెరవేర్చకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తుందని ఆరోపించారు. రానున్న రోజుల్లో అన్ని వర్గాలను ఏకం చేసి వారి సమ స్యలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరిం చారు.

బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు జీ రాంబాబు యాదవ్ మాట్లాడుతూ కార్మికులందరూ ఐక్యంగా ఉండాలని, చిల్లర మల్లర యూనియన్ల మాటలు నమ్మి మోసపోవద్ద న్నారు. అనంతరం పలు తీర్మానాలు పెట్టి ఆమోదిం చారు. సమావేశంలో బీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివశంకర్, ఆశ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సంతోషి, రాష్ట్ర సలహాదారు మంజుల, జి యువరాజు, నాయ కులు తదితరులు పాల్గొన్నారు.



నీటితో కళకళలాడుతున్న లక్నవరం

## లక్నవరానికి జలకళ

**31 అడుగులకు చేరుకున్న నీటిమట్టం**

పర్యాటక ప్రాంతమైన లక్నవరం సరస్సు జలకళ ను సంతరించుకుంది. కొద్ది రోజులుగా కురు స్తున్న వర్షాలకు వరద చేరగా, ఆదివారం సాయంత్రానికి నీటిమట్టం 31 అడుగులకు చేరు కుంది. సరస్సు పూర్తి సామర్థ్యం 33.5 అడుగులు కాగా, మరో 2.5 అడుగులు పెరిగితే సరస్సు మత్తడి దుంకి పరవళ్లు తొక్కనుంది. - గోవిందరావుపేట, జూలై 28

## సైబర్ నేరగాళ్ల ఉచ్చులో బాధితుడు

**రూ.2.30 లక్షలు పోగొట్టుకున్న వైనం**



బాధితుడు శ్రీధర్

గంగారం, జూలై 28 : మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పెద్దఎల్లాపురం గ్రామానికి చెందిన గుండగాని శ్రీధర్ సైబర్ నేరగాళ్ల ఉచ్చుకు చిక్కాడు. రూ.2.30లక్షలు పోగొట్టుకున్నాడు. ఎస్సై రవికుమార్ కథనం ప్రకారం.. గుండగాని శ్రీధర్ సెల్‌ఫోన్‌కు ఈ నెల 26న గుర్తుతెలియని వ్యక్తి వాట్సాప్ మెసేజ్ ద్వారా లింక్ పంపి ఓపెన్ చేయాలని కోరగా, అతడు స్పందించలేదు. దీంతో సైబర్ నేరగాళ్లు రూటు మార్చి బ్యాంకు యాప్‌ను అప్డేట్ చేసుకోవాల్సిందిగా మెసేజ్ ద్వారా లింక్ పంపారు. దీంతో నమ్మిన శ్రీధర్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకున్నాడు. ఈ క్రమంలో తన ఆధార్‌కు సంబంధించిన ఓటీపీలు రావడంతో పెద్దగా పట్టించుకోలేదు. ఈ క్రమంలో తన బ్యాంక్ అకౌంట్ నుంచి రూ.2.30 లక్షలు డ్రా అయినట్లు మెసేజ్ రావడంతో కంగుతిన్న బాధితుడు వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు ఫోన్ చేసి విషయం చెప్పాడు. శ్రీధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

*వరంగల్ ఇన్నర్ రింగ్ రోడ్డు (ఐఆర్ఆర్)కు గ్రహణం పట్టింది. నిధుల లేమితో భూసేకరణ జరగక నిర్మాణ పనులు నిలిచిపోయాయి. గత కేసీఆర్ ప్రభుత్వం ఖమ్మం రోడ్డులోని ఆర్టీఏ ఆఫీస్ జంక్షన్ నుంచి నర్సంపేట రోడ్డు మీదుగా ఎనుమాముల మార్కెట్ వరకు సుమారు 8 కి.మీ. మేర 200 అడుగుల వెడల్పుతో ఐఆర్ఆర్ నిర్మాణాన్ని చేప ట్టింది. 2022-23లో రూ.50కోట్లతో ఐఆర్ ఆర్ రోడ్డు నిర్మాణ పనులను ఓ కాంట్రాక్టర్‌కు కేటా యించింది. కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) ఈ పనులను పర్యవేక్షిస్తున్నది. కొద్దినెలల క్రితం మొదలైన పనులు 1/300 కిమీ నుంచి 4/700 కిమీ మధ్యలో జరిగాయి. నిర్దే శిత పనుల్లో 35 శాతం వరకు పూర్తి కాగా, తమకు పరిహారం చెల్లించకుండా పనులు చేయొద్దని భూనిర్వాసితులు అడ్డుకోవడంతో రెండు నెలల క్రితం నిలిచిపోయాయి. నెల రోజుల క్రితం వరంగల్‌కు వచ్చిన సీఎం సీఎం రేవంత్‌రెడ్డి ఐఆర్ఆర్‌పై స్వయంగా సమీక్ష జరిపినా పరిస్థి తిలో మార్పు లేదు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. ఇప్పటికే పరిహారం కోసం రోడ్డెక్కిన భూనిర్వాసితులు ఆందోళనను తీవ్రం చేసేందుకు సమాయత్తమవుతున్నారు.*

- వరంగల్, జూలై 28 (నమస్తే తెలంగాణ)



ఖిలావరంగల్ వద్ద ఆగిపోయిన ఇన్నర్ రింగ్‌రోడ్డు పనులు

**8 కి.మీ. కోసం సేకరించాల్సిన భూమి 125 ఎకరాలు**

- సేకరించింది 78 ఎకరాలే.. భూ బాధితులకు అందని పరిహారం
- మిగిలిన భూసేకరణకు రూ.132 కోట్లు అవసరం
- నిధులు ఇవ్వని కుడా.. ముందుకు సాగని భూసేకరణ
- పరిహారం కోసం కార్యాలయాల చుట్టూ బాధితుల ప్రదక్షిణలు
- సీఎం సమీక్ష జరిపి నెలరోజులైనా ముందుకు సాగని వైనం
- ఆందోళనకు సిద్ధమవుతున్న భూ నిర్వాసితులు

# ఐఆర్ఆర్‌కు నిధుల గ్రహణం!

**అర్ధాంతరంగా ఆగిపోయిన నిర్మాణ పనులు**

తొలిదశలోని 8 కి.మీ. ఐఆర్ఆర్ నిర్మాణం కోసం సుమారు 125 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంద ని రెవెన్యూ అధికారులు గుర్తించారు. ఖిలావరంగల్ మండలంలోని తిమ్మాపూర్, ఖిలావరంగల్, ఉర్సు, గీసుగొండ మండలంలోని గొర్రెకుంట, వరంగల్ మండలంలోని ఎనుమాముల రెవెన్యూ గ్రామాల పరి ధిలో ఈ భూమిని సేకరించాల్సి ఉంది. ఇప్పటికే అధి కారులు తిమ్మాపూర్, ఖిలావరంగల్, ఉర్సు రెవెన్యూ గ్రామాల పరిధిలో సుమారు 78 ఎకరాలను సేకరిం చి, అవార్డ్ కూడా పాస్ చేశారు. భూములు కోల్పోయి న వారిలో పలువురికి ప్రభుత్వం రూ.113.25 కోట్ల పరిహారం అందజేసింది. ఇంకా కొందరికి పంపిణీ చేయాల్సి ఉందని తెలిసింది. దీంతోపాటు గొర్రెకుంట, ఎనుమాముల రెవెన్యూ గ్రామాల పరిధిలో మరో 47 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉండగా, ఇందుకోసం రూ.132 కోట్లు అవసరమని అధికారులు అంచనా వేశారు. 47 ఎకరాల భూసేకరణకు సర్వే పూర్తి చేసి అవార్డ్ పాస్ చేసే కసరత్తు కూడా చేపట్టారు. తీరా నిధులు లేకపోవడంతో భూసేకరణ పనులు ముందు కు సాగడం లేదు. కుడా ఈ నిధులను కేటాయించాల్సి ఉంది. నిధులు ఇవ్వకపోతే భూసేకరణలో ముందుకె ళ్లలేమని, ఇప్పటికే పరిహారం అందని రైతులు తమపై ఒత్తిడి తెస్తున్నారని రెవెన్యూ అధికారులు పేర్కొంటు న్నట్లు సమాచారం. దీంతో ఐఆర్ఆర్ నిర్మాణం కోసం జరగాల్సిన భూసేకరణ ఆగిపోయింది. ప్రధానంగా ఇప్పటికే ఐఆర్ఆర్ కోసం సేకరించిన భూములకు సంబంధించి పరిహారం అందని బాధితులు పలుమా ర్లు కలెక్టర్, వరంగల్ ఆర్డీవోతోపాటు మంత్రులను కలి శారు. ఐఆర్ఆర్ భూ బాధితుల సమాఖ్య పేరుతో ఆందో ళనకు సిద్ధమవుతున్నారు. త్వరలోనే కార్యాచరణ ప్రక టిస్తామని సమాఖ్య అధ్యక్షుడు దయాకర్ చెప్పారు.

**సీఎం సమీక్ష జరిపినా..**

జూన్ 29న జిల్లాలో పర్యటించిన సీఎం రేవంత్‌రెడ్డి హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో ఐఆర్ఆర్ పనుల పురోగతిపై సమీక్ష జరిపారు. కలెక్టర్‌తోపాటు కుడా అధికారులు ఆయనకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఐఆర్ఆర్ పనుల పురోగతిని వివరిం చారు. భూసేకరణ సహా నర్సంపేట రోడ్డు వద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం, ఐఆర్ఆర్ కోసం మరో రూ.150 కోట్లు అవసరమని సీఎంకు చెప్పారు. ఆ తర్వాత జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హైదరాబాద్‌లో నిర్వ హించిన సమావేశంలో ఐఆర్ఆర్ పనులపై అధికారులతో చర్చించారు. మంత్రి కొండా సురేఖ కూడా ఐఆర్ఆర్ పనులను పూర్తి చేయ డంపై రెవెన్యూ, కుడా అధికారులతో మాట్లా డారు. అయినా, ఐఆర్ఆర్ నిర్మాణ పనుల పురోగతిలో ఒక అడుగు కూడా ముందుకు పడ లేదు. ఈ క్రమంలో భూములు కోల్పోయిన రైతులు తాజాగా ఆందోళనకు రెడీ కావడం ప్రస్తుతం చర్చనీయాంశమైంది.


# ఉద్యోగ నియామకాల్లో అక్రమాలు

**ములుగు జిల్లా వైద్య కళాశాల సిబ్బంది నియామకాల్లో అక్రమాలు చోటుచేసుకు న్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా అనుభవం లేని వారికి ఉద్యోగాలు కేటాయించినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ దవాఖాన జూని యర్ అసిస్టెంట్ సోదరుడికి థియేటర్ అసిస్టెంట్, ల్యాబ్ టెక్నీషియన్‌కు డిసెక్షన్ హాల్ అటెండెంట్‌గా పోస్టులివ్వడం చర్చ నీయాంశంగా మారింది. మొత్తంగా మెడికల్ కాలేజీ ఉద్యోగ నియామకాల్లో రాజకీయ ఒత్తిళ్లు పనిచేసినట్లు గుసగు సలు వినిపిస్తున్నాయి.**

- ములుగు, జూలై28 (నమస్తే తెలంగాణ)




ములుగు జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాల



ప్రభుత్వ దవాఖానలోని నోటీస్ బోర్డుపై ప్రదర్శించిన నిబంధనలు

- ములుగు మెడికల్ కాలేజీలో నిబంధనలకు తూట్లు
- జూనియర్ అసిస్టెంట్ సోదరుడికి థియేటర్ అసిస్టెంట్ పోస్టు
- డిసెక్షన్ హాల్ అటెండెంట్‌గా ల్యాబ్ టెక్నీషియన్
- పనిచేసిన రాజకీయ ఒత్తిళ్లు

ములుగు మెడికల్ కళాశాలలో చేపట్టిన 32 ఉద్యోగ నియామకాల్లో అవకతవకలు జరిగినట్లు తెలుస్తోంది. ఎంపికలో అక్రమాలు జరుగుతున్నా యని గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన ప్రజాసం ఘాల జేఏసీ చైర్మన్ కుమార్రెకు, ఓ ప్రైవేట్ ల్యాబ్ టెక్నీ షియన్‌కు డిసెక్షన్ హాల్ అటెండెంట్లుగా, ప్రభుత్వ దవా ఖానలో జూనియర్ అసిస్టెంట్ సోదరు డికి, డిగ్రీ చదివిన ఓ వ్యక్తికి థియేటర్ అసిస్టెంట్ పోస్టులివ్వడం తీవ్ర దుమారం రేపుతోంది. ఈ ఉద్యోగాలకు ఏదేని ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్ కాలే జీలో రెండేళ్లపాటు అనుభవం ఉండా లని నిబంధనల్లో పేర్కొన్న అధికారులు అవేవీ పట్టించుకోలేదు. వీరికి ఎలాంటి అర్హతలున్నాయి? అనుభవం ఉందా? లేదా? అనే కారణాలను గాలికొదిలే శారు. ఉద్యోగాల భర్తీలో అవకతవకలు చోటుచేసుకుంటున్నాయని జూన్‌లో 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన 'కొలువులు.. మస్తు పైరవీలు' కథనానికి అధికారులు స్పందించి పారదర్శకంగా నియామకాలు చేపడుతున్నామని ప్రకటించి కేవలం డాటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులకు టైపింగ్ పరీక్ష నిర్వహించారు. అన్ని పోస్టుల భర్తీలో ప్రొవిజనల్ లిస్టును నోటీస్ బోర్డుపై ప్రదర్శించిన అధికారులు మెరిట్ ఉన్న 1:2 కానీ, 1:3 కానీ పెట్టకుండా డైరెక్టర్‌గా వారికి నచ్చిన వారినే ఎంపిక చేశారని అభ్య ర్థులు ఆరోపిస్తున్నారు. వైద్య కళాశాల ఉద్యోగ నియామకాల్లో రాజ కీయ ఒత్తిళ్లు పనిచేసినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఐఏఎస్ అధి కారులు, ఉన్నత వైద్యాధికారులు, ఉపాధి కల్పన అధికారిని తప్పు దోవ పట్టించి జరిపిన నియామకాలపై విచారణ జరిపి చర్యలు తీసు కొని అర్హులకు న్యాయం చేయాలని నిరుద్యోగులు కోరుతున్నారు.

### అనర్హులుంటే రద్దు చేస్తాం

ఉద్యోగ నియామకాలను 100 శాతం పారదర్శకతతో చేపట్టాలని నిర్ణయం తీసుకున్నాం. ప్రస్తుతం ఎంపికైన అభ్యర్థుల్లో అనర్హులు ఉన్నట్ల యితే విచారణ జరిపి నియామకాలను రద్దు చేస్తాం. కళాశాల ప్రారంభ మైతే మరిన్ని ఉద్యోగాలు రానున్నాయి. ప్రస్తుతం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల మెరిట్ లిస్ట్ నుంచే రెండో, మూడో విడతలో ప్రాధాన్యత ఇస్తాం. ప్రస్తుతం జరిగిన ఎంపికలో కింది స్థాయి సిబ్బంది ప్రమేయం ఉంటే చర్యలు చేపట్టి నియామకాలపై పున:సమీక్ష చేస్తాం.

– డాక్టర్ మోహన్‌లాల్, ములుగు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్



- హామీలను అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వం
- పూర్తిగా రుణమాఫీ కాకపోవడంతో రైతుల మనోవేదన
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

# ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

వర్ధన్నపేట, జూలై 28: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు, వైఫ ల్యాలను ప్రజలకు వివరించాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పిలుపునిచ్చారు. మండలంలోని ఇల్లంద శివారు ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి అధ్యక్ష తన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి రావడం కోసం కాంగ్రెస్ నేతలు అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చారన్నారు. రైతులందరికీ రూ.2లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేస్తామని చెప్పి కేవలం రూ.లక్షలోపు మాత్రమే మాఫీ చేశా రని పేర్కొన్నారు. ఇందులో కూడా 50 శాతం మంది అర్హులైన రైతు లకు రుణమాఫీ జరగకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురవుతున్నా రని అన్నారు. ఇవే మాఫీ చేయలేని ప్రభుత్వం రూ.2లక్షల వరకు పంట రుణాలను ఏవిధంగా మాఫీ చేస్తుందని విమర్శించారు. దీనికి తోడుగా 200ల యూనిట్లలోపు విద్యుత్‌ను వినియోగించుకునే పేద లకు అనేక కొర్రీలు పెట్టి ఉచిత విద్యుత్‌ను అమలు చేయడం లేదని అన్నారు. దీనికి తోడుగా పేదలకు అనేక హామీలు ఇచ్చిందని, వాటిని కాంగ్రెస్ సర్కారు ఎక్కడా అమలు చేయడంలేదని వివరించారు. ఈ విషయాలను ప్రజలకు సమగ్రంగా వివరించి బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు.

కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తాను ముందుండి తీరుస్తానని వివరించారు. సమావేశంలో పార్టీ నాయకులు మార్గం భిక్షపతి, గుజ్జ సంపత్‌రెడ్డి, సిలువేరు కుమారస్వామి, తుమ్మల యాకయ్య, ఎండీ రహీమ్, మాధవరావు, కంజర్ల రవి, మహేశ్, కొండేటి శ్రీనివాస్, ఆయా గ్రామాల పార్టీ ముఖ్య నాయకులు, కార్య కర్తలు పాల్గొన్నారు.



ఉధృతంగా జాలువారుతూ ఆకట్టుకుంటున్న బొగత జలపాతం

## తెరుచుకున్న బొగత

**జలపాతం వద్ద పర్యాటకుల సందడి**

**నాలుగు రోజులుగా నిలిపివేసిన బొగత జలపాతం సందర్శన ఆదివారం తిరిగి ప్రారంభమైంది. దీంతో పెద్ద ఎత్తున పర్యాటకులు తరలివచ్చి సందడి చేశారు. ఫొటోలు, సెల్ఫీలు దిగుతూ ఎంజాయ్ చేశారు. ఇటీవల వరద ఉధృతితో పాటు బీటెక్ విద్యార్థి నీటిలో మునిగి మృతి చెందడంతో సందర్శనను నిలిపివేశారు. ఉధృతి కొద్దిమేర తగ్గడంతో సందర్శనకు అనుమతిచ్చారు. జలపాతం ముందుభాగం, ఈత కొలను చుట్టూ అటవీ, బొగత, పోలీసు సిబ్బంది పర్యవేక్షణలో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు.**

- వాజేడు, జూలై 28

## పోషకాల పుట్ట

- అడవుల్లో సహజ సిద్ధ పుట్ట గొడుగులు
- రుచితోపాటు ఆరోగ్యం
- గతేడాది కట్టకు రూ.50
- డిమాండ్ పెరగడంతో రూ. 500కు విక్రయం



పుట్టపై మొలచిన పుట్ట గొడుగులు



సేకరించిన పుట్ట గొడుగులు

మహదేవపూర్, జూలై 28: ప్రకృతి సిద్ధంగా అడవుల్లో పెరిగే పుట్ట గొడుగుల రుచి అద్భుతంగా ఉంటుంది. ఇందులో సమృద్ధిగా పోషకాలు కూడా ఉండడంతో పుట్టగొడుగు (పుట్టకొక్కు)లకు భలే డిమాండ్ ఉన్నది. వర్షాకాలంలో అందుబాటులో ఉండే ఈ ప్రకృతి ఆహారంపై ప్రజలు ఆసక్తి కనబ రుస్తున్నారు. ఎలాంటి రసాయ నాలు లేకుం డా ప్రకృతి ఒడిలో వాటంతటవే మొలకెత్తి, రుచితో పాటు పుష్కలంగా పోషక విలువలు ఉండడంతో జనాలు వీటిని తీసుకునేందుకు ఉత్సాహం చూపుతున్నారు. దీంతో వీటి గిరాకీ ఊపందుకుం ది. గతేడాది పుట్టగొడుగుల కట్ట రూ.50 ఉండగా, ఈ యేడాది ఏకంగా రూ.500 పలుకుతోంది. ధర ఎక్కువైనా పర్వాలేదని, ఈ సీజన్‌లో ఒక్కసారై నా వాటి రుచి చూడాలని చాలా మంది వాటిని కొనుగోలు చేస్తున్నారు. కొందరైతే కొందామంటే ధర ఎక్కువగా ఉందని అడవి బాట పడుతున్నారు. గతంలో గిరిజనులు, కొన్ని కుటుంబాలు మాత్రమే పుట్ట కొక్కుల కోసం అడవులకు వెళ్లేది. ప్రస్తుతం అధిక డిమాండ్ ఉండడంతో మహదేవపూర్ మండలంలోని పలు గ్రామాల యువకులు వేకువజామునే వెళ్లి వాటిని సేకరిస్తున్నారు. అక్కడి వారికి ఇది మంచి ఉపాధి మార్గంగా మారింది.

# ప్రమాదం అంచున గోదావరి కరకట్ట

- వరద తాకిడికి కోతకు గురవుతున్న ఒడ్డు
- కూలిపోతున్న రివిట్‌మెంట్
- కర్రలు పాతి.. ఇసుక బస్తాలు అడ్డుగా వేస్తున్న అధికారులు
- భయాందోళనలో ప్రజలు



కరకట్ట ఒడ్డు కోతకు గురవుతున్న చోట వేసిన ఇసుక బస్తాలు

ఏటూరునాగారం, జూలై 28 : వరద తాకిడితో గోదావరి కరకట్ట కోతకు గురై ప్రమాదకరంగా మారుతున్నది. ఏటూరునాగారం-రా మన్నగూడెం మధ్యలో గతంలోనే పలుచోట్ల దెబ్బతిన్నది. ప్రస్తుతం వరద వేగానికి కట్ట కింది భాగంలోని ఒడ్డు కొట్టుకుపోతున్నది. అక్క డక్కడా రివిట్‌మెంట్ కూలిపోతున్నది. ఒడ్డు కోతకు గురవుతున్న ప్రదేశంలో నీటి పారుదలశాఖ అధికారులు కర్రలు పాతి, ఇసుక బస్తాలు వేసి కాపాడే ప్రయత్నం చేస్తున్నారు. గత కొద్దిరోజులుగా 15 వేల ఇసుక బస్తాలను పలుచోట్ల వేసినట్లు తెలుస్తున్నది. ఇటీవల కురు స్తున్న వర్షాలకు తోడు పైనుంచి వస్తున్న వరదతో గోదావరి నీటి మట్టం క్రమంగా పెరుగుతూ, తగ్గుతూ ఉన్నది. ఈ నేపథ్యంలో రామ న్నగూడెం నుంచి ఏటూరునాగారం వైపు కిలోమీటర్ దూరంలో ఒడ్డు కోతకు గురికావడంతో కూలీలు బోటులో కర్రలు తీసుకెళ్లి నీటిలో డ్రిల్లింగ్ చేస్తూ పాతుతున్నారు. వాటి పక్క నుంచి ఇసుక బస్తాలు వేస్తూ కోతను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. దీనిని నిరంతరం కొనసాగిస్తున్నారు. ఇప్పటికే రెండుసార్లు ఇసుక బస్తాలు వేశారు. గతే డాది కట్ట దెబ్బతిన్న చోట సుమారు రూ. 6 కోట్లతో మరమ్మతులు చేపట్టారు. మట్టి పోసి రివిట్‌మెంట్ చేయగా, వరద తాకిడికి అది కుంగిపోయింది. వరద బాగా వస్తే కట్ట తెగిపోతుందనే భయాందో ళన ప్రజల్లో నెలకొంది. రెండేళ్ల క్రితమే అప్పటి ప్రభుత్వం కట్ట నిర్మాణం, మరమ్మతు, పటిష్టత కోసం రూ. 130 కోట్లను కేటాయిం చింది. కానీ సాంకేతిక కారణాల వల్ల పనులు జరగలేదు. కొత్త టెక్నా లజీతో కరకట్ట నిర్మాణం చేపట్టేందుకు డిజైన్‌లో మార్పులు చేయడం వల్లే గత వేసవిలో పనులు ప్రారంభించనట్లు తెలుస్తున్నది. ఇదిలా ఉండగా మంగపేట మండలంలో కూడా ఒడ్డు గోదావరి తాకిడికి కొట్టుకుపోయింది. వేసవిలోనే పనులు పూర్తి చేయాల్సిన అధికారులు పట్టించుకోకుండా వరద పెరిగినపుడు హడావిడి చేస్తున్నారంటూ రామన్నగూడెం వాసులు ఆరోపిస్తున్నారు. కరకట్ట దెబ్బతిన్న ప్రదే శాన్ని అధికారులు ముందుగానే గుర్తించినప్పటికీ సత్వర చర్యలు చేప ట్టలేదంటున్నారు. ప్రస్తుత వరద ఉధృతికి పాతుతున్న కర్రలు, వేస్తున్న ఇసుక బస్తాలు రక్షణగా ఉంటాయా? అనే సందేహాన్ని ముంపు ప్రాంత వాసులు వ్యక్తం చేస్తున్నారు.



కరకట్ట కోతకు గురవుతున్న ప్రాంతానికి వెళ్లి కర్రలు పాతుతున్న కూలీలు